


అన్ని కుటుంబాలనూ ఆరోగ్య సిబ్బంది సందర్శించాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

ఆరోగ్య సిబ్బంది అన్ని కుటుంబాలనూ సందర్శించి, ఆరోగ్య పరిరక్షణ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సర్పంచ్ జల్లి బాలరాజు అన్నారు. పుల్లేటికుర్రు గ్రామపంచాయతీ వద్ద మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సిబ్బంది సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాలు కురుస్తుండడంతో డ్రెయినేజీల్లో చెత్త వేయకూడదన్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, చికెన్ ,చేపల దుకాణాలు తనిఖీ చేసి నాణ్యమైన ఆహార పదార్ధాలు విక్రయించే విదంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి డి.లక్ష్మీపతి, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్ హెచ్ పి లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ బాలరాజు

గోదావరి ఈత.. కడుపు కోత..

- కన్నవారి గుండెల్లో బడబాగ్ని
- అధికార యంత్రాంగం నిర్లక్ష్యం
- అక్రమ ఇసుక తవ్వకాలూ కారణమే

గోదావరిలో పిల్లల ఈత సరదా కన్నవారి గుండెల్లో గాయాలు రేపుతోంది. స్నేహితులంతా గోదావరి తీరానికి వచ్చాక స్నానానికి దిగారు. ఒకరు కొట్టుకుపోతుంటే మరో ముగ్గురు కాపాడడానికి వెళ్లారు. వాళ్లూ కొట్టుకుపోతుంటే మరో ఇద్దరు దిగారు. ఇలా ఒకరి తర్వాత ఒకరు ఎనిమిది మంది మునిగిపోయారు. ముమ్మిడివరంలో ఈ విషాదం మురువకముందే పి.గన్నవరం మండలం రావిలంకంలో గోదావరిలో ఈతకు దిగి మంగళవారం మరో ముగ్గురు గల్లంతయ్యారు.

ప్రజాశక్తి - అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం

అమ్మానాన్నలకు ఊరెళ్తామని చెప్పి వెళ్లి ఆ పిల్లలు ఇళ్లకు తిరిగి రాలేదు. వారు గోదాట్లోకి స్నానానికి దిగి గల్లంతయ్యారన్న సమాచారం మాత్రం చేరింది. సమాచారం తెలిసి కొందరు అచేతనంగా అక్కడే కూలబడిపోతే ఇంకొందరు కన్నా ఎక్కడున్నావురా అంటూ గుండెలు బాదుకుంటూ విలపిస్తున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం శేరిలంకలో స్నేహితుడి ఇంట వేడుకకు కాకినాడ, మండపేట, రామచంద్రపురం తదితర ప్రాంతాల నుంచి వెళ్లిన 11 మంది మిత్ర బృందం భోజనాలయ్యాక గోదావ తీరానికి వెళ్లారు. వీరిలో ఒకరు గోదావరిలో మునిగిపోతుండగా కాపాడేందుకు ప్రయత్నించి మరో ఏడుగురు నీటి ప్రవాహానికి కొట్టుకు పోయారు. సలాదివారిపాలెం గ్రామానికి ఆనుకుని ఉన్న గోదావరి నది తీవ్ర కోతకు గురికావడంతో ఒడ్డునే లోతుగా ఉంటుందని స్థానికులు తెలిపారు. స్నానాలకు దిగిన పిల్లలు ఇతర ప్రాంతాలకు చెందినవారు కావడంతో గోదావరి స్థితి తెలియక ప్రమాదవశాత్తూ గల్లంతయ్యారని చెబుతున్నారు. సంఘటనపై ప్రభుత్వ యంత్రాంగం తక్షణం స్పందించింది. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్పి కృష్ణారావు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎన్డీఆర్ఎఫ్ బందాలను రంగంలో దింపి గాలింపు చర్యలు చేపట్టారు. తీరం వద్ద విద్యుద్దీపాలు ఏర్పాటుచేశారు.

ముమ్మిడిరం మండలంలో కమిని పంచాయతీ సలాదివారి పాలెం గోదావరి రేవులో సోమవారం 11 మంది యువకులు స్నానాలకు దిగి 8 మంది గల్లంతు కావడం విదితమే. ఈ గల్లంతైన వారి కోసం విస్తతంగా గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం సాయంత్రం నాటికి ఏడుగురి యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. మిగిలిన ఒకరి మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. లభ్యమైన మృతదేహాలను ముమ్మిడివరం కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి శవ పంచనామా పూర్తి చేసి బంధువులకు అందజేస్తున్నారు.

మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

గోదావరి నదిలో మతి చెందిన యువకుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, మతి చెందిన ప్రతిఒక్కరికీ రూ.కోటి పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. సంఘటనా స్థలాన్ని సిపిఎం బృందం సందర్శించింది. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గోదావరి నదిలో నుండి అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్ల అక్కడక్కడా భారీ గుంతలు ఏర్పడుతున్నాయని, అలాంటి చోట్ల ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవటం వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. దీనికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇసుక మాఫియా అక్రమ తవ్వకాలు మీడియాలో వస్తున్నా, ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్నా ఉన్నతాధికారుల యంత్రాంగం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దానివల్లే ఈరోజు 8 మంది ప్రాణాలు బలి తీసుకుదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, ఎన్.బలరామ్ తదితరులు ఉన్నారు.

ముమ్మిడివరం మండలం కమిని వద్ద విద్యార్థులు దుర్మరణం చెందడం ఎంతో విచారకరమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.సురేంద్ర, ఎంటివివిఎస్ సుబ్బారావు సంతాపం తెలిపారు. గోదావరి పరీవాహక ప్రాంతాలు, సముద్ర తీర ప్రాంతాల్లో ఇటీవల చాలామంది విద్యార్థులు గల్లంతవుతున్నారని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విద్యార్థులు తల్లిదండ్రులు కూడా తగు జాగ్రత్తలు తీసుకుని తమ బిడ్డలు ఇటువంటి ప్రమాదాలు బారిన పడకుండా కాపాడుకోవాలని సూచించారు.



ముమ్మిడివరంలో గాలింపు ప్రదేశంలో కన్నీరు మున్నీరవుతున్న మృతుల కుటుంబాలు



పి.గన్నవరంలో గల్లంతైన విద్యార్థుల దుస్తులు, చెప్పులు

గోదావరి స్నానానికి వెళ్లి ముగ్గురు గల్లంతు

ప్రజాశక్తి-పి.గన్నవరం

గోదావరిలో ఎనమిది మంది గల్లంతైన ఘటనలో ఒక పక్క గాలింపు సాగుతుండగానే అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మరో విషాదం చోటు చేసుకుంది. పి.గన్నవరం మండలం నాగుల్లంక శివారు ఆచంట మండలం అయోధ్యలంక పంచాయతీ పరిధిలో రావిలంక సమీపంలో గోదావరిలో స్నానం చేస్తూ ముగ్గురు యువకులు గల్లంతైన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఐదుగురు యువకులు గోదావరిలో స్నానం చేయడానికి వెళ్ళగా ముగ్గురు గోదావరిలో మునిగి పోయినట్లు వారి బట్టలు, సెల్ ఫోన్‌లు గోదావరి ఒడ్డున గుర్తించారు. ఈ విషయమై స్థానికులు తహశీల్దారు పి.శ్రీపల్లవి, ఎస్ఐ బి.శివకష్ణకు సమాచారం ఇవ్వగా గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన వారిలో నాగుల్లంకకి చెందిన సానబోయిన సూర్య తేజ (12), నీతిపూడి పాల్ కుమార్ (15), కేతా ప్రవీణ్ (15)గా గుర్తించినట్లు తెలుస్తుంది. అధికారులు వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ సంఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు.



అయోధ్యలంక ఘటనా ప్రదేశంలో ఎంఎల్ఎ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

క్వాయర్ యూనిట్ల స్థాపనకు చొరవ చూపాలి

ప్రజాశక్తి - అమలాపురం

కోనసీమకొబ్బరి, క్వాయర్ విలువ ఆధారిత ఉత్పత్తుల యూనిట్ల స్థాపనకోసం ఉద్యాన, పరిశ్రమల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు ఐదు రోజుల పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో క్వాయర్, కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలపై అధ్యయన చేసిన బృందం పర్యటన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బృంద సభ్యులు విలువ ఆధారిత వస్తువుల తయారీ సాంకేతికత సంస్థలను, విలువ ఆధారిత పరిశ్రమలను సందర్శించి అధ్యయనం చేశారని వాటి వివరాలను వివరించామన్నారు. వచ్చిన కోకోనట్ ఆయిల్ తయారీ న్యూట్రిషన్ విలువలతో మిక్సింగ్ కేంద్ర ఫుడ్ టెక్నాలజీ పరి శోధనా సంస్థ , మైసూరు, వారి ఉత్పత్తులను అధ్యయనం చేసిందన్నారు. బిజినెస్ ఇంక్యుబేషన్ కేంద్రానికి కొబ్బరి ముడి సరుకు అందించి తమకు కావలసిన ఉత్పత్తులను తయారు చేయించుకునే విధానాలపై పరిశోధన చేశారన్నారు. కొబ్బరి ఆహార విలువ ఆధారిత పరిశ్రమలు కొబ్బరి నీరా నుండి పంచదార తయారీ ఫార్ములాలు ఎంసిటి పౌడర్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ విధివి ధానాలు కొబ్బరి అభివృద్ధి బోర్డు, క్వాయర్ బోర్డులను సందర్శించి ప్రోత్సాహక చర్యలపై బందం అధ్యయనం చేసిందన్నారు. అలాగే కుమరన్ క్వాయర్ పరిశ్రమ ఎఫెక్ట్స్ కోకో సోలార్ ఎనర్జీ లిమిటెడ్ తిరుపూర్ ఎన్ ఆర్‌కె ఫుడ్స్ కేరళాలను సందర్శించి ఉత్పత్తుల తయారీ విధానాలపై బృందం అవగాహన పొందిందన్నారు. కోనసీమలో కొబ్బరికాయల నాణ్యతను పరీక్షించి, అవి విలువ ఆధా రిత ఉత్పత్తుల పారిశ్రామిక ఉత్పత్తికి అనుకూలంగా ఉన్నాయో లేదా అన్నది అంచనా వేయాల్సిన అవసరం ఉందని కమిటీ సిఫార్సు చేసిందన్నారు. కోనసీమలో లభించే కొబ్బరి నాణ్యతకు తగిన ఉత్పత్తుల ను పారిశ్రామిక ఉత్పత్తికి ప్రో త్సహించాలనీ పారిశ్రామిక ఉత్పత్తికి అనువైన రకాల కోసం కొత్త తోటల పెంపకం సమయంలో కేంద్ర పరిశోధన సంస్థ నైపుణ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని బృందం సిఫార్సు చేసిందన్నారు. క్వాయర్ బోర్డు సాంకేతిక సంస్థలు విద్యార్థులు, స్వయం సహాయక సంఘాలు, భావి పెట్టుబడి దారులకు సెమినార్లు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడానికి సహకరించాలని బృందం సూచించిందన్నారు. విలువ ఆధారిత ఉత్ప త్తులు బహుముఖంగా ఉంటాయి కనీసం 20 ఎకరాల్లో ఇంటిగ్రే టెడ్ కోకో పార్క్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని సిఫార్సు చేసిందన్నారు. కామ న్ ఫెసిలిటీ కేంద్రం, ఇంక్యుబేషన్ సెంటర్, పరీక్షా ప్రయోగశాల సూక్ష్మ, చిన్న పరిశ్రమల కోసం ఫ్లాట్డ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ మధ్య తరహా సంస్థలకు పారిశ్రామిక ప్లాట్లు కేటాయించాలని బృంద సభ్యులు సూచించారన్నారు. క్వాయర్ బోర్డులో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం, మెంబర్షిప్ పొందేలా పరిశ్ర మల కార్యదర్శికి లేఖ ద్వారా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో బృంద సభ్యులు జిల్లా పరి శ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పికెపి.ప్రసాద్, ఎల్‌డిఎం.కేశవ వర్మ, ఎపి ఐసిసి జోనల్ మేనేజర్ ఎ.రమణా రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ సాయినాథ్, జయచంద్ర ,గాంధీ జిల్లా ఉద్యాన అధికారి బివి.రమణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి - మామిడికుదురు

యోగాతో ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు సూచించారు యోగాంద్ర కార్యక్రమంలో భాగముగా మంగళవారం మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖలకు చెందిన ఉద్యోగులు యోగాసనాలు చేశారు ముందుగా మండల పరిషత్ కార్యాలయము నుండి 216వ జాతీయ రహదారి మీదుగా సెంటర్ వరకు యోగ అవగాహనా ర్యాలీ నిర్వహించారు యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు ప్రతీ ఒక్కరూ యోగాలో భాగస్వాములు కావాలని అభిలచించారు ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి అడబాల శ్రీనివాసరావు, మండల పరిపాలనాధికారి కారుపల్లి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు జి వాసు, పిఎస్ఎన్.రాజు, బివివి.సత్యనారాయణ, డి సురేష్, ఎస్ఎస్ఎన్.రాజు సచివాలయ ఉద్యోగులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ సుభాష్‌కు అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు గ్రహీత, గ్రామ సర్పంచ్ సంగిత సుభాష్‌కు ఘన సత్కారం జరిగింది. పినపళ్ల వెటర్నరీ డాక్టర్ ఈదల శ్రీనివాస్ చౌదరి మంగళవారం సర్పంచ్ సుభాష్ నివాసానికి వెళ్లి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్ లో మరిన్ని విజయాలు, అవార్డులు సాధించి గ్రామాభివద్ధికి కృషి చేయాలని ఆకాక్షించారు.

కార్టూ'నిజం'



ఉపాధి బకాయిలు విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఉపాధి హామి వేతన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.శివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆరు వారాలుగా ఉపాధి కూలీలు పనులు చేస్తున్నా ఒక్కరోజు వేతనం కూడా ప్రభుత్వం చెల్లించలేదని దీంతో ఉపాధి కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే ఉపాధి బకాయిలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి పర్యటనలో భాగంగా మంగళవారం అమలాపురం మండలం తాండవపల్లి గ్రామంలో ఉపాధి పర్యటన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి కోపం వచ్చినప్పుడల్లా ఉపాధి చట్టాన్ని ఎత్తి వేస్తామని అంటున్నాడని,గ్రామాల్లో ఉన్న పెత్తందారులు కూడా అదేమాట అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితిలో ఈ చట్టం రద్దు అవ్వకుండా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ చట్టాన్ని కాపాడుకుంటేనే కార్మికులకు ఎంతో కొంత మేలు జరుగుతుందని తెలిపారు. ఉపాధి కార్మికులకు పనిదినాలు 200 రోజులు పెంచాలని, కూలి రేట్లు రూ.600 పెంచాలని, ఫే స్లిప్ గతంలో ఇచ్చే విధానంగా ఇప్పుడు కూడ ఇవ్వాలని, కార్మికులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే ఇన్సూరెన్స్ రూ 5లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికిట్లు, టెంట్లు, గునపం, పార లాంటి పని ముట్లు అందించాలని డిమాండ్ చేశారు. మేట్లకు పారితోషకం రూ.10 ఇవ్వాలని, మొబైల్ రీచార్జి ప్రతీ నెలకు రూ.300 చెల్లించాలని, మేట్లు అందరికీ ఫోన్లు ప్రభుత్వమే కొనుగోలు చేసి ఇవ్వాలని డిమాండ్ చేసారు. అలాగే ప్రభుత్వం ఎన్నికలు ముందు ఇచ్చిన హామీ ప్రకారం కూలీలు అందరికి ఆరునెలల పాటు రూ.6వేల పెన్షన్ ఇవ్వలని దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. రోడ్లుకిరువైపులా చెరువుగట్లపై ఉన్న కొబ్బరి చెట్లును పేదలకు పంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి దైవవాణి, పి అలేఖ్యా, మట్టా శాంతి కుమారి, గుత్తుల దుర్గ, ఇల్లా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

సిఎం నారా చంద్రబాబు ఈ నెల 31 ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాలలో పర్యటిస్తారని, సిఎం పర్యటనను అధికారులు విజయవంతం చేయాలని కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి పర్యటనల బృంద సభ్యులు జిల్లా స్థాయి అధికారులతో స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశమై పర్యటన ఏర్పాట్లపై ముందస్తుగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 31న ముఖ్యమంత్రి చెయ్యేరు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక వద్ద మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం ద్వారా రూ.9.88 కోట్లతో చేపట్టిన చెరువు పూడికతీత పనులు పరిశీ లించి స్థానికంగా ఉపాధి కూలీలలో పింఛన్ లబ్ధి దారులకు ఒక రోజు ముందుగానే పింఛన్ పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రజా వేదిక వద్ద. ప్రభుత్వ, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో రూపొందించిన (పి4) పథకం బంగారు కుటుంబం లబ్ధి దారులు, మార్గదర్శకులను ముఖ్యమంత్రి మాట్లాడి కోనసీమ జిల్లాలో (పి4) పథకాన్ని లాంఛనంగా ప్రారంభి స్తారన్నారు. తొలుత ముఖ్యమంత్రి హెలిప్యాడ్ చేరుకొని స్థానిక ప్రజాప్రతినిధులను మర్యాద పూర్వకంగా కలుసుకుం టారన్నారు. తదుపరి చెరువు పూడికతీత పనులు పరిశీ లించి స్థానికంగానే పింఛన్లు లబ్ధిదారులకు ఒకరోజు ముందుగానే పంపిణీ చేస్తారన్నారు. తదుపరి ప్రజావేదిక చేరుకుని పి4 పథకాన్ని ప్రారంభించి సభలో ప్రసంగిస్తారన్నారు. చివర్లో వేదిక వద్దే పార్టీ ప్రతినిధులతో సమావేశం అవుతారన్నారు. ముఖ్య మంత్రి పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చురుగ్గా సాగు తున్నాయని, సిఎంఒ కార్యాలయ ప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారని వీరి పర్యటన అనంతరం పర్యటనకు సంబంధించి మినిట్ టూ మినిట్ ప్రోగ్రాం ఫైనలైజ్ కావలసి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డిఆర్ఒ రాజకుమారి, డ్వామా పథక సంచాలకులు ఎస్.మధుసూదన్, ఆర్‌డిఒలు పి.శ్రీకర్, కె.మాధవి, డిఎల్‌డిఒ రాజేశ్వరరావు, సిఎమ్ఒ కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

ఆక్వా రైతులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

సురక్షితమైన పద్ధతులతో అధిక దిగుబడిని సాధించేందుకు ఆక్వా రైతులకు గ్రంప్ ఇంప్రూవ్మెంట్ సిస్టమ్స్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు ఇండియ కన్సల్టెంట్ లక్కరాజు సత్యనారాయణ్, ఇండియా సేల్స్ హెడ్ శివ ప్రసాద్, టెక్నికల్ హెడ్ నానంగ్ తెలిపారు. మంగళవారం అమలాపురం హైట్స్‌లో జరిగిన కార్యక్రమంలో మేలైన పద్ధతులలో ఆక్వా సాగుపై ఎస్.ఐ.ఎస్. కంపెనీ ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఎస్ కంపెనీ ప్రతినిధి లక్కరాజు సత్యనారాయణ్ అధ్యక్షత వహించగా ఇండియా సేల్స్ హెడ్ శివ ప్రసాద్, ఎస్ఎస్ఎస్. టెక్నికల్ హెడ్ నానంగ్ హిందార్తో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆక్వా రైతులకు మేలైన పద్ధతులలో అధిక దిగుబడిని సాధించేందుకు అవరమైన మెళకువలను తెలియజేశ్శారు. వారు విలేకరులతో మాట్లాడుతూ ఆక్వా రైతులకు ఎస్ఐఎస్ కంపెన్నీ ఎప్పటికప్పుడు ఆక్వా కల్చర్ యాజమాన్య పద్ధతులను తెలియజేసి రైతులు మంచి దిగుబడి సాధించే విధంగా మార్గదర్శనం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఎస్ ఫామ్ డేటా ఎనలిస్ట్ డాక్టర్ రిషి, రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన ఆక్వా రైతులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న టెక్నికల్ హెడ్ నానంగ్

పంచాయతీకి తాగునీటి ట్యాంకర్ బహూకరణ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండల కేంద్రమైన ఉప్పలగుప్తం పంచాయతీ శివారు తాగునీటి ఎద్దడి గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు దాతలు ట్రాక్టర్ తాగునీటి ట్యాంకర్ ను బహుకరించారు.గ్రామానికి చెందిన పాస్టర్ చిక్కం సాంబమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారులు దానియేలు, ఇస్సాక్, కుటుంబ సభ్యులు ఈ తాగునీటి ట్యాంకర్ ను పంచాయతీకి సమకూర్చారు. ఉప్పలగుప్తం ప్రార్థనా శక్తి ఆవరణలో మంగళవారం స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తాగునీటి ట్యాంకర్‌ను తహశీల్దార్ విఎస్.దివాకర్ ప్రారంభించి గ్రామపంచాయతీకి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాస్టర్ సాంబమూర్తి కుటుంబీకులు చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, ఎంపిడిఒ పిఆర్‌సి.రాజ్ కుమార్, గ్రామ పెద్దలు ఆకుల రామకృష్ణ, గారపాటి రాజారావు, మోటూరి సత్యంకాపు, రవణం మధు, చీకట్ల కిషోర్, చిక్కం సూర్యమోహన్, పంచాయతీ కార్యదర్శి తిక్కిరెడ్డి రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకర్ ను ప్రారంభిస్తున్న తహశీల్దార్ విఎస్.దివాకర్

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - రావులపాలెం

సైబర్ నేరాలపై మహిళలు అవగాహన కలిగి ఉంటే జాగ్రత్తలు తీసుకోవడం చాలా సులభమని ఐసిడిఎస్ సూపర్ వైజర్ నాగసత్యవేణి అన్నారు. మంగళవారం మండల పరిధి పొడగట్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తపేట సిడిపిఒ ఎ.గజలక్ష్మి ఆదేశాలు మేరకు కిశోర వికాసంలో భాగంగా సైబర్ నేరాలు, ఆన్లైన్ భద్రత వివిధ సమస్యలపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో సూపర్ వైజర్ నాగ సత్యవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ బలహీనతలు ఆసరాగా చేసుకొని ఇటీవల సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఓటిపి నెంబరు తెలుసుకొని బ్యాంకు ఖాతాలో నగదు ఖాళీ చేస్తున్నారన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షల్లో నగదు ఆఫర్ చేసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. సైబర్ నేరాలు రోజు రోజుకీ పెరిగి పోతున్నాయని వాటిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉంటే సైబర్ నేరాలు అధిగమించవచ్చున్నారు. మహిళలకు ఉన్న చట్టాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకొని అప్ డేటెడ్ గా ఉండాలన్నారు. అలాగే మహిళలు, కిశోర బాలికలకు పలు సమస్యలు పై అవగాహన కల్పించి అప్రమత్తంగా ఉండాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, ఆశాలు, మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నాగసత్యవేణి

అర్జీల పరిష్కారానికే ప్రాధాన్యత

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు పరిష్కార సరళిలో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజాసంతప్తి కొలమానంగా అధికారు లు పనిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. మంగళ వారం అమరావతి నుండి వివిధ జిల్లాల కలెక్టర్లతో భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి జయలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రజా పరిష్కార వేదిక అర్జీలు పెండింగ్ అంశాలు, ఆడిట్ పేరాల పెండింగ్ జిల్లాల వారీగా సమీక్షిం చారు. అదేవిధంగా ఉద్యోగుల బదిలీలు, జిఒ 30 ప్రకారం భూముల క్రమబద్ధీకరణ-2025, అర్హులందరికీ ఇల్లు నీటి తీరువ వసూళ్ళ రీ సర్వే అంశాలపై కూడా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా సుపరిపాలనను ప్రజలకు చేరువ చేసే దిశగా పిజి ఆర్ఎస్ కార్యక్రమాన్ని తీసుకుని వచ్చిందని తద్వారా ప్రభుత్వ ఆశయ సాధనకు అధికార యంత్రాంగం పాటుపడాలన్నారు. నదీ తీరం వెంబడి ఉన్న గ్రామాలలో ప్రస్తుతం ఉన్న రేవు పాయింట్లు వద్ద భారీ కేడింగులు ఏర్పాటు చేసి ప్రజా భద్రతకై పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నది తీరం వెంబడి ప్రజలు విచ్చలవిడిగా నదిలోనికి ప్రవేశించకుండా భద్రతా చర్యలను చేపట్టాలని సూచించారు. ఫిర్యాదులు ప్రాథమికంగా విచారించి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి సమస్యకు నూటికి నూరు శాతం పరిష్కార మార్గం అత్యం త నాణ్యతతో చూపడం ద్వారా అర్జీలు పెండింగ్ సమస్యలు ఉత్పన్నం కావన్నారు. సిటిజన్ యాక్టివ్ ఆడిట్ పేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశిం చారు నీటి తీరువ వసూళ్లు ముమ్మరం చేయాలని, రీ సర్వే ప్రక్రియలను క్యాలెండర్ ప్రకారం సమాంతరంగా నిర్వహిస్తూ పురోగతి సాధించాలన్నారు ఈ కార్యక్రమంలో జెసి టి.నిషాంతి, డిఆర్ఒ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

పూర్తి కాని జలజీవన్ పనులు

- ప్రారంభం కాకుండానే లీక్ అవుతున్న వాటర్ ట్యాంక్
- ఎర్రపోతవరం దళిత వాడకు అందని తాగునీరు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి మంచినీరు అందించాలని సదుద్దేశంతో ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ పనులు అడ్డెక్క కావస్తున్న ఇప్పటికి పూర్తి కాలేదు. జలజీవన్ మిషన్ పథకం కింద రామచంద్రపురం మండలానికి , కె.గంగవరం మండలానికి రూ.33 కోట్లు మంజూరయ్యాయి. అందులో భాగంగా ఎర్ర పోతవరం గ్రామంలోని మంచినీటి పైప్లైన్లు, ఇక్కడ కొత్తగా నిర్మించే వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరయ్యాయి. దీంతో రూ.పది లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మించారు. ఇప్పటివరకు గ్రామంలోని దళితవాడ పైపులైన్లను పూర్తి చేసి మంచినీరు అందించలేకపోయారు. దీంతో దళితులు మంచినీళ్లకు అక్కడక్కడకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. జలజీవన్ మిషన్లో కొన్ని పనులు పూర్తి చేసి వెళ్లిపోయిన కాంట్రాక్టర్ మిగిలిన పనులను పూర్తి చేయలేదు. దీంతో ఇక్కడ నిర్మించిన వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారింది. ఈ ట్యాంకు పనులు ప్రారంభించకుండానే లీక్ అవుతోంది. దీంతో గ్రామస్తులు ఈ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆర్డబ్ల్యుఎస్ ఎఇ రాహుల్, డిఇ రామారావు మంగళవారం పరిశీలించారు. అదే విధంగా ఎర్ర పోతవరం మెయిన్ ట్యాంక్ నుంచి కొత్తగా నిర్మించిన ట్యాంక్ నీటి సరఫరా జరగకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు ఎర్ర పోతవరంలోని జంగాల కాలనీకి, పంపన వారి పాలానికి మంచినీరు పైపులైన్లు వేయలేదు. వారికి కూడా మంచినీరు అందడం లేదు. దీనిపై అధికారులు స్పందించి దళితులకు మంచినీరు అందించేలాగా చర్యలు తీసుకోవాలని, ట్యాంక్ నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో ఏర్పడిన లీకులను అరికట్టాలని, తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బిల్లులు చెల్లించడంలో జాప్యం

రామచంద్రపురం మండలం లో రూ 18 కోట్లు, కె.గంగవరం మండలంలో రూ 15 కోట్లు మొత్తం రూ.33 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించామని రామారావు, ఆర్డబ్ల్యుఎస్ డిఇ రామారావు తెలిపారు. అయితే పనులకు బిల్లులు సక్రమంగా రాకపోవడంతో జలజీవన్ మిషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మంగళవారం ఎర్ర పోతవరం వచ్చిన డిఇని దళిత కాలనీలకు మంచినీరు అందడం లేదని, జంగాలు కాలనీకి, పంపన వారి పాలానికి నీరు అందడం లేదని ఆయన దృష్టికి తీసుకురాగా, దళితవాడలో పైపులైన్ పనులు జరుగుతున్నాయని, ఇక్కడ ఏర్పాటు చేసిన ట్యాంకు నీరు సరఫరా చేసి తర్వాతా దాని నీరందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉందని ఇప్పటికి 40 శాతం పనులు పూర్తయి అని ఆయన వివరించారు. పనులు పూర్తి చేసేందుకు కాలపరిమితి ఈ ఏడాది జూన్తో ముగుస్తుండగా ప్రభుత్వం 2028 వరకు పనులు పొడిగించిందని ప్రజాశక్తికి వివరించారు.



లీక్ అవుతున్న ట్యాంక్ ను పరిశీలిస్తున్న అధికారులు



ప్రారంభించకుండానే లీక్ అవుతున్న వాటర్ ట్యాంక్ ఇదే

నేరాలు ఘోరాలు

పాముకాటుతో బాలుని మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఇంట్లో ఆడుకుంటుండగా పాముకాటుకు గురై బాలుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన జనిపి రెడ్డి శ్రీరాములు, నాగలక్ష్మి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరు గ్రామంలోని బ్రహ్మగుండేశ్వర గుడి సమీపంలో ఉంటున్నారు. శ్రీరాములు కూలి పని చేసుకుంటూ భార్యాబిడ్డలను పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో కుమారుడు మోహన్ నాగ సూర్య(5) మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఎప్పటిలాగే మంచం కిందకు వెళ్లి ఆడుకుంటున్నాడు. కాసేపటికి కుమారుని చూసే సమయానికి స్పృహతప్పి అపస్మారక స్థితిలో ఉన్నాడు. బాలుడు శరీరంపై పాము కాటు వేసినట్లుగా గాయం ఉండటంతో తల్లిదండ్రులు హుటాహుటిన కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే బాలుడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్లో కేసులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అధికంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము మంగళవారం తెలిపారు. వివరాలు ఇవి... సాధారణ వాహనాల తనిఖీలు భాగంగా వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తుండగా అధికంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి బ్రీతింగ్ ఎనలైజర్ మిషన్ ద్వారా టెస్టింగ్ చేశారు. వారు పరిమితికి మించి అధికంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యు.కొత్తపల్లిలో...

ద్విచక్ర వాహనాల రికార్డులను తనిఖీ చేస్తున్న పోలీసులకు మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్న ఇరువురిని గుర్తించి వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఇద్దరిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే రెండు ద్విచక్ర వాహనాలకు రికార్డులు లేనట్లు గుర్తించినట్లు వివరించారు. అలాగే నేరం చేసి తిమ్మాపురం పోలీసులు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని నీలపల్లి జగనన్న కాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 3010 లు స్వాధీనం చేసుకున్నట్లు కోరంగి ఎస్ఐ. సత్యనారాయణ తెలిపారు. ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు.

పిల్లలకు చిత్రహింసలు : తల్లిదండ్రులకు జైలు

ప్రజాశక్తి - కడియం

కన్న పిల్లలను చిత్రహింసలు పెట్టిన తల్లిదండ్రులకు న్యాయమూర్తి శిక్ష విధించిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడియం గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఖండవల్లి దాసు, ఖండవల్లి కృపావతి తమ కన్న పిల్లలను శరీరకంగా చిత్రహింసలు పెట్టడంతో చైల్డ్ లైన్ టీమ్ సభ్యుని ఫిర్యాదు మేరకు కోన్సేబుల్ శ్రీతం పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం రాజమహేంద్రవరం ఏడో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి.బాబు దాసు, కృపావతి దంపతులకు మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు కడియం పోలీసులు తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ అధికారి ఎన్వివి.సత్య నారాయణ ఆదేశించారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు నిధులు మంజూరైన లబ్ధిదారులతో ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా చూడాలని ఆదేశించారు. యోగాంధ్ర, పిజిఆర్ఎస్, ఐవీహెచ్ఎల్ సంబంధిత అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నాయక్, ఎంపిడిఒ రవికుమార్, హౌసింగ్ డిఇఇ, ఎఇ, వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

21వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 21వ రోజుకు చేరుకుంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో ఇంజినీరింగ్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు, సభ్యులు బాసిన భద్రరావు, కె.వెంకటరమణ, వాకాడ భాస్కరరావు, ఆకుల రామకృష్ణ, తమ్మిరెడ్డి వెంకటేశ్వరరావు, డి.రాజు, పి.శ్రీనివాస్, జి.సతీష్, గుడిసె నాగేశ్వరరావు, ఎస్.కె.బషీర్ పాల్గొన్నారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ, సామర్లకోట

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో మంగళవారం జిల్లాలోని సినిమా థియేటర్ల నిర్వహణపై అన్ని మండలాల తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, అగ్నిమాపక, ఫుడ్ సేఫ్టీ శాఖలతో కూడిన బృందాలు ఆయా సినిమా థియేటర్లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కాకినాడ పట్టణంలో చాణిక్యాంధ్రపుత్ర, దేవి మల్టీప్లెక్స్, ఆనంద్, సంగీత్, తిరుమల థియేటర్లను బృందం తనిఖీ చేసింది. తునిలో శ్రీరామ, పిఠాపురంలో వెంకటేశ్వర, శ్రీనివాస్, ఏలేశ్వరం జయశ్రీ, పెద్దాపురం శ్రీభద్ర, సామర్ల కోటలో జయలక్ష్మి థియేటర్ కాంప్లెక్స్లో ఉన్న స్క్రీన్-1, స్క్రీన్-2 (జయలక్ష్మి, మినీ జయలక్ష్మి) థియేటర్లను అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. ఆహార పానీయాల నాణ్యత, టికెట్ ధరలు, తినుబండారాలు, తదితర అంశాలను పరిశీలించారు.

నగరం ఎంఎంసి నూతన పాలకవర్గం నియామకం

ఛైర్మన్గా పెనుమాల లక్ష్మీ

ప్రజాశక్తి - మామిడికుదురు

నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని 20 మంది సభ్యులతో నియమిస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఈ నెల 26న ఆదేశాలు జారీచేశారు. పి. గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతారు. మొగలికుదురుకు చెందిన జనసేన వీర మహిళ పెనుమాల లక్ష్మి ఛైర్మన్గా, గుడాల వెంకట రమణ (మొండెపులంక) వైస్ ఛైర్మన్గా, సభ్యులుగా జంపన శ్రీను (పి.గన్నవరం), బొక్కా లలితాదేవి (పెదపట్నం), కండిబోటి సత్యకుశ్రీ (పి.గన్నవరం), కుంపట్ల మల్లికార్జునరావు (పెదపట్నం లంక), లంకె వెంకటలక్ష్మి (ఎల్.గన్నవరం), బూటుకుర్తి సత్యనారాయణ (కె.ముంజవరం), నిమ్మకాయల వెంకటలక్ష్మి (కె.ఏనుగుపల్లి), సూరిశెట్టి వెంకటేశ్వరరావు (నాగులంక), పెంటా ఏసుకుమారి (ఊడిమూడి), పినిశెట్టి రామచంద్రశేఖర్ (ఆదుర్రు), అడబాల నాగమణి (కె.ముంజవరం), చిట్టాల రామకోగేశ్వరరావు (ఎల్.గన్నవరం), పితాని వెంకటేశ్వర రావు (పాశర్లపూడి లంక), నగరం సర్పంచ్ జాలెం రమణ కుమారితో మరో ముగ్గురు అధికారులను సభ్యులుగా నియమించారు ఈ కమిటీ ఏడాది పాటు కొనసాగుతుందని ఆదేశాల్లో పేర్కొన్నారు.



పెనుమాల లక్ష్మీ



రమాబాయి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న పలువురు

మాతా రమాబాయికి ఘన నివాళి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో మంగళవారం మాతా రమాబాయి 89వ వర్ధంతి కార్యక్రమం వడ్డీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత మాతా రమాబాయి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆరేల్వాడం మాట్లాడుతూ బాబాసాహెబ్ చదువుకు బ్యాక్ బోన్గా మాతా రమాబాయి అసమాన సేవలందించారన్నారు. కానీ ఈ దేశ ఆణగారిన వర్గాల కొరకు తను తన జీవితాన్నే కాక తన పిల్లల జీవితాల్ని కూడా కోల్పోయి మన జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఆమె సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచి ఉంటారని కొనియాడారు. పలువురు మాట్లాడుతూ మా కోసం, మా భవిష్యత్ కోసం తన కన్నపిల్లల్ని పోగొట్టుకున్న మాతృమూర్తి రమాబాయి అని 'మాతృత్యానికి నిలువెత్తు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో పులుమంతుల రజనీ తో పాటు రమాబాయి అంబేద్కర్ మహిళా సంఘం సభ్యులతో పాటు పలువురు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని ద్రాక్షారామలో బుధవారం విద్యుత్ సరఫరా కు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాల రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.రామచంద్రపురం నుంచి కొత్తపేట, ముమ్మిడివరం 132/33 కెవిబిద్యుత్ ఉపకేంద్రం, 132 కెవి డబుల్ సర్క్యూట్లో వున్న పాతిపోయిన టవర్లు తొలగించి కొత్త టవర్లు ఏర్పాటుచేసేందుకు మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా 33 /11 కెవి లైను క్రాసింగ్ వుండటం వలన మండలంలో ద్రాక్షారామ సెక్షన్ లో 11 కెవి తాళ్లపాలెం ఫీడర్ మీద గల నెలపర్తిపాడు, వేలం పాలెం, గణపతినగరం గ్రామాలకు విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగునని ఆయన తెలిపారు.

ఘనంగా మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు

ప్రజాశక్తి - అలమూరు

మండలంలోని చొప్పెల్ల గ్రామ దేవత శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు మంగళవారం నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ పున్న నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు ఈనెల 31 తో ముగుస్తాయని వారు తెలిపారు.. ఈనెల 31న అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన అనంతరం భారీ అన్న సమారాధనతో పాటుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమాలకు అందరూ ఆహ్వానితులే అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లా నారాయణమూర్తి, పిల్లా సూర్యనారాయణ, సుంకర శ్రీరాములు, నందుపడిని గోవిందరాజు, మురకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా

ప్రజాశక్తి - యానాం

ఐటిఐలో వివిధ ట్రేడుల్లో సాంకేతిక శిక్షణ పొందిన అభ్యర్థులకు బుధవారం యానాం ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్ఛార్జ్ ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణసుధాకర్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. తమిళనాడు కాంచీపురంలోని ఎల్ అండ్ టి కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్మెన్ సివిల్, వెల్డర్, మెకానిక్ మోటార్ ట్రేడుల అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు యానాంలో ప్రభుత్వ ఐటిఐలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. యానాం రీజియన్ కు చెందిన ఐటిఐ ఆఖరి సంవత్సర విద్యార్థులు, శిక్షణ పూర్తిచేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9849010936 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్టియుకెలో పని చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నగర కో కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జెఎన్టియుకెలో కాంట్రాక్ట్ లెక్చరర్లు చేపట్టిన ఆందోళనకు సిఐటియు మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ గత 18 సంవత్సరాల నుంచి 133 మంది కాంట్రాక్ట్ లెక్చరర్స్ పని చేస్తున్నారన్నారు. వీరిని కొత్తగా ఇంటర్వ్యూలు జరిపి మళ్లీ విధులకు తీసుకుంటామని చెప్పడం దారుణమన్నారు. గతం నుంచి పని చేస్తున్న వారిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుధీర్కుమార్, డాక్టర్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఉపాధి పనులుగా ముమ్మరంగా జరుగుతున్నాయని ఎపిఒ సుధీర్ తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిధిలో పలు గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 23 గ్రామాల్లో 43 ఉపాధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనుల్లో 3197 మంది కూలీలు పనులు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - అమలాపురం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ నుంచి గడియారం స్తంభం వరకు 11వ అంతర్జాతీ య యోగా దినోత్సవం పురస్కరించుకుని మాస్ ర్యాలీని స్థానిక జిల్లా స్థాయి అధికారులు ప్రజలు, డ్వాక్రా సంఘాల సభ్యు లు, ఉపాధి కూలీలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు యోగాంధ్ర - 2025 పేరిట ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెసి టి.నిషాంతి మాట్లాడుతూ సమాజం లో ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే యోగాను ప్రమోట్ చేసేందుకు లక్షిష్ చేయాలని కోరారు. యోగ కేవలం వ్యాయామం కాదని శరీర, మానసిక, యోగా రోగ నిరోధక శక్తిని పెంచి,శరీరాన్ని వ్యాధుల నుండి రక్షిస్తుందన్నారు. యోగా ఆరోగ్య రథమైన ఆహారపు అలవాట్లకు దారితీస్తుందన్నారు. యోగా మానసిక ఒత్తిడిని, ఆందోళ నను తగ్గిస్తుందన్నారు. యోగా నిరంతర సాధనతో మానసిక ప్రశాంతత కలిగిస్తూ భావోద్వేగాన్ని నియంత్రించి ఏకాగ్రతను జ్ఞాపకశక్తిని పెంచుతుందని యోగా ఆత్మజ్ఞానం వైపు పయ నించడానికి ఒక మార్గమని మనస్సును, శరీరాన్ని, ఆత్మను ఏకం చేస్తుందన్నారు. ఆరుచేక పోటీ జీవనశైలిలో, యోగాను రోజువారీ దినచర్యలో భాగం చేసు కోవాలన్నారు.

అధికారులు, యోగా గురువులతో సమావేశం

స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా ఎస్సి, బిసి, సంక్షేమ అధికారులు, స్వచ్ఛంద సంస్థల యోగా గురువుల తో సంయుక్తంగా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహిం చారు. కార్యక్రమం లో డిఆర్ఒ రాజకుమారి, డిఇఒ. షేక్ సలీం బాషా, సాంఘిక సంక్షేమ సాధికార అధికారి పి.జ్యోతిలక్ష్మి దేవి, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్, జిల్లా వైద్య సాయి అధికారి బోను దుర్గా రాణి, బాబు, ఎల్డీఎం కేశవ వర్మ, ద్వామా పీడీ మధు సూదన్, యోగా గురువులు పాల్గొ న్నారు.



అమలాపురంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

యోగా అభ్యాసకులకు శిక్షణ

ఆత్రేయపురం: మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమములో భాగంగా యోగ అభ్యాసకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బిఐఎస్ఎన్.వెంకటరామన్, పి.శ్రీనివాస్, పీడీ, పి.శోభారాణి, పిఐఈలు యోగా అభ్యాసకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇఒపిఆర్డి యు.చంద్రశేఖర్, పరిపాలనాధికారి వి.రామ స్వరూప్, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

యోగా డేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - అలమూరు

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా జూన్ 21న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగా డేను విజయవంతం చేసే విధంగా అందరూ కృషి చేద్దామని రామచంద్రపురం డివిజనల్ పంచాయతీ అధికారి, ఎంపిడిఒ ఎ.రాజు పిలుపునిచ్చారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగా డే శిక్షణ సదస్సు నిర్వహించారు. మండల పరిపాలన అధికారి ఎం.మెహర్ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్ ద్వారా ఎంపిడిఒ రాజు దృశ్య రూపంలో గ్రామ సచివాలయ ఉద్యోగులకు శిక్షణను అందించారు. ఈ సదస్సును ఎంపిపి తోరాటి లక్ష్మణరావు పర్యవేక్షించారు. ఆరోగ్యానికి సంపూర్ణ రక్షణను అందించే యోగాను ప్రతీ ఒక్కరు అభ్యసించాలని ఆయన కోరారు. గ్రామ కార్యదర్శులు ఎస్.వీర్రాజు, వి వేణి, వీరమాత, వెంకటరత్నం, జె.అయ్యన్న, వైద్య ఆరోగ్య సేవల సిబ్బంది పాల్గొన్నారు.



అలమూరు నిర్వహించిన సదస్సులో శిక్షణ ఇస్తున్న ఎంపిడిఒ

కమిషనర్ తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

వచ్చే వర్షాకాలంలో వార్డుల్లో వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ నిర్వహణకు చర్యలు చేపట్టాలని కోరితే, కమిషనర్ లెటర్ ఇవ్వమనడంపై ఫ్లోర్ లీడర్ ముత్యాల బాలకృష్ణ కమిషనర్ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. నగర పంచాయతీ కౌన్సిల్ హాలు నందు మంగళ వారం చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. తొలుత 9 అంశాలతో కూడిన అజెండాను, 5 అంశాలతో కూడిన టేబుల్ అజెండాను ప్రవేశపెట్టిన పలు సమస్యలపై చర్చించారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమలు ప్రబలకుండా అన్ని వార్డుల్లో యుద్ధ ప్రాతిపదికన శానిటేషన్ చర్యలు చేపడుతూ చేసే విధంగా అప్రమత్తం కావాలని సమావేశం దృష్టికి తీసుకురాగా, లెటర్ పూర్వకంగా ఇవ్వాలని కమిషనర్ కోరడంతో ఫ్లోర్ లీడర్ బాలకృష్ణ కమిష నర్ తీరు సమంజసంగా లేదన్నారు. సభ్యులు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువస్తే లెటర్ ఇవ్వమనడం, సభ్యులను అవమానించడమేనని, కమిషనర్ తీరు మార్చుకో వాలన్నారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్ కుమార్ కల్పించుకుని సభ్యులు తీసుకు వచ్చిన సమస్యలు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాల ని కమిషనర్ను సూచించారు. జాతీయ రహదారి వెంబడి తురులు వేయకుండా వేసిన అదనపు వెంచర్లపై ఏం చర్యలు తీసుకున్నారో, కమిషనర్ సమాధానం చెప్పాలని బాలకృష్ణ పట్టుబట్టారు. వెంచర్ దారు కన్వర్షన్ కట్టారని సమాధానమిచ్చారు. వాటికి నోటీసులు ఇచ్చారా లేదా అని బాలకృష్ణ ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార వెంచర్లో ఏ విధమైన నిర్మాణాలు చేపట్టకుండా పట్టణ ప్రణాళిక అధికారులు పర్యవేక్షణ ఉండేలా ఆదేశాలు జారీ చేయాలని ఆదేశించారు. డంపింగ్ యార్డులో చెత్తను తీసుకు వెళ్లేందుకు రబ్బీష్తో అప్రోచ్ రోడ్డు నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మండి పడ్డారు. తక్షణమే చెత్తను రోడ్లు పక్కన కాకుండా డంపింగ్ యార్డు లోపలికి తీసుకువెళ్లే విధంగా రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. వార్డుల్లో సేకరించిన చెత్తను తీసుకు వెళ్లే ట్రాక్టర్ ఒకటి ఉందని చెత్త సేకరణ చేసేందుకు ట్రాక్టర్లు కొనుగోలు చేయాలని కోరారు. 7వ వార్డు చప్పిడివారిపాలెంలో రూ.30 లక్షలతో నిర్మించే రోడ్డు పనులు ప్రారంభించక పోవడంతో ప్రజలు రాకపోకలు చేసేం దుకు ఇబ్బంది పడుతున్నారని కౌన్సిలర్ శ్రీనివాస్ కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. పంప్ హౌస్లో పని చేసే సిబ్బందికి కరెంట్ పోల్స్ ఎక్కించడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే అధికారులు బాధ్యత వహిస్తారా అని కౌన్సిల్లో ప్రస్తావించారు. 13వ వార్డులో గల రెండు నెలలుగా విధి లైట్లు వెలగడం లేదని, శానిటేషన్ లేక వార్డుల్లో పలువురు వ్యాధుల బారిన పడుతున్నారని, ప్రజలకు ముఖం చూపించే పరిస్థితి లేదని కౌన్సిలర్ బాలకృష్ణ కన్నీటి పర్యంతమయ్యారు. అమృత 2.0 పథకం ద్వారా మంజూరు అయ్యే రూ.14.50 కోట్లకు నగర పంచాయతీ వాటా రూ.2.75 కోట్లు సాధారణ నిధుల నుంచి చెల్లించే విధంగా ఉన్న నోటు మార్పులని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సమావేశంలో నగర పంచాయతీ మేనేజర్, ఎఇ, సచివాలయ, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలం లోని ర్యాలి గ్రామంలో అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు గొడుగులను పంపిణీ చేశారు. అనంతరం ర్యాలి సందర్శకులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ మోహిత్ సీత, శ్యామ్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

కందుకూరికి ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ, పెద్దాపురం

కాకినాడలో సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం జన విజ్ఞాన వేదిక ఘనంగా నివాళులర్పించింది. జెవివి మంగళవారం స్థానిక బోట్ క్లబ్ వద్ద ఉన్న కందుకూరి విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం జరిగింది. జెవివి ప్రధాన కార్యదర్శి ఎన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర్వర్మ, జెవివి రాష్ట్ర కార్యదర్శి కెఎంఎం ఆర్.ప్రసాద్, దళిత ఉద్యమ నేత ఐతాబత్తుల రామేశ్వ రరావు, పెన్షనర్ల సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కె.సత్తిరాజు, జెవివి కార్యదర్శి యుఎస్ఎన్.రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా వితంతు వివాహాలకు వీరేశలింగం కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెవివి నగర శాఖ అధ్యక్షులు ఆలపాటి శ్రీనివాస్, జెవివి కార్యదర్శులు ఎన్.వి.పద్మావతి, బివిఎ.సత్యనారాయణ, ఎం.రామకృష్ణ, సిఐటియు నాయకులు మలకా వెంకట రమణ, మేడిశెట్టి వెంకటరమణ, బి.రాజా, పలివెల వీరబాబు, జెవివి నాయకులు చింతపల్లి సుబ్బారావు, డాక్టర్ వేదుల శిరీష్, పి.మధుకుమార్, ఈశ్వరరావు పాల్గొన్నారు. పెద్దాపురంలో ని స్థానిక యానపు సూర్య రావు భవనంలో కందుకూరి వర్ధంతిని పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చిల్డ్రన్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అజయ్ కుమార్ మాట్లాడారు. సభ ప్రారంభానికి ముందు కందుకూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సభలో పిసిని శ్రీనివాసరావు, కార్యదర్శి అరుణ్కుమార్, ప్రజానాట్యమండలి నాయకులు రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, అంజలి, అమల, చిల్డ్రన్ క్లబ్ సభ్యులు జశ్విత, అమృత, స్వప్న, బంగారం పాల్గొన్నారు.

29న జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ఆర్ఆర్బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 29న మధ్యాహ్నం 2 గంటల నుంచి జిల్లా స్థాయి జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ బాక్సింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్నాయని, ఈ పోటీల్లో పాల్గొనేవారు 2009-2010లో పుట్టిన వారై ఉండాలన్నారు. ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ ఒరిజినల్ తీసుకురావాలన్నారు. ఈ పోటీలో ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి పోటీలకి ఎంపిక అవుతారని తెలిపారు.
